
ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024
5
పార్వతీపురం మన్యం



కేంద్ర మంత్రిని కలిసిన సంధ్యారాణి

సాలూరు : కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవిని గురువారం ఢిల్లీలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కలిశారు. రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు కేంద్ర మంత్రి చెప్పినట్లు తెలిపారు. రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి ఆమె వెంట వున్నారు.



కేంద్రమంత్రికి వినతిని అందజేస్తున్న రాష్ట్రమంత్రి సంధ్యారాణి

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారుల్లో ఇమిడి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వెలికితీయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రతో కలిసి ప్రారంభించారు. ముందుగా భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆట ప్రదర్శనతో దేశానికి అపారమైన కీర్తిని ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ అని కొనియాడారు. విద్యతో పాటు క్రీడా నైపుణ్యాన్ని చాటి ఆటల్లో రాణించాలన్నారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ క్రీడాల్లో రాణించి జాతీయ స్థాయిలో పేరు, ప్రఖ్యాతులు సాధించవచ్చున్నారు. క్రీడలు మానసిక, శారీకక ధృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చున్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కురుపాం నియోజవర్గం ప్రథమ స్థానం, సాలూరు నియోజక వర్గం ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఆర్చరీ (విలు విద్య) పోటీల పలు విభాగల్లో కాంపౌండ్ బాయ్స్ విభాగంలో పి.లోకేష్ ప్రథమ స్థానం, చేతన్ స్వరూప్ ద్వితీయ, కాంపౌండ్ గర్ల్స్ విభాగంలో జి.తన్విక, జి.తనీషా, రికర్వ్ బాలుర విభాగంలో ఎ.కళ్యాణ్, ఎన్ జయంత్, బి ఫణేంద్ర, బాలికల విభాగంలో పి.త్రివేణి, ఎన్. హేమన్య, ఇండియన్ బాలుర విభాగంలో డి.పవన్ కుమార్, జె.దేవీప్రసాద్, బాలికల విభాగంలో ఎస్.అఖిల, బి.శ్రీప్రియ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

అనంతరం 2023-24 సంవత్సరం క్రీడా ప్రతిభ అవార్డులను



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర

జ్ఞాపికలను కలెక్టర్, ఎమ్మెల్యే బహూకరించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను సన్మానించారు. ప్రతిభ అవార్డు లు ఉల్లి భద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, సాలూరు మండలం పురోహితుని వలస ఎపిఎంఎస్ తృతీయ, కొత్త గూడ జి టి డబ్ల్యూ ఏ ఉన్నత పాఠశాల నాల్గవ స్థానం, నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐదవ స్థానం సాధించారు.జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. క్రీడాకారుల తో వాలీబాల్ ఆడి వారిలో క్రీడా స్ఫూర్తిని, ఉల్లాసాన్ని నింపారు. కార్యక్రమంలో డిఇఒ జి.పగడాలమ్మ, ఎస్జిఎఫ్ సెక్రటరీ డి.టి. గాంధీ, పిఇటిల సంఘం అధ్యక్షులు ఎమ్.రామకృష్ణ, కార్యదర్శి ఎం.మురళీకృష్ణ, విడిఎస్ఎస్ కె.తిరుపతిరావు, క్రీడాకారులు, తదితరులు, పాల్గొన్నారు.

ఎస్పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి బలిజిపేట, గరుగుబిల్లి పోలీస్ స్టేషన్లను గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసు స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రం, రికార్డు రూమ్, కంప్యూటర్ రూమ్, ప్రాపర్టీ భద్ర పర్చే గదులను, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పలు ముఖ్యమైన రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, నాటుసారా అక్రమ రవాణా నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశింఆరు. అలాగే స్టేషన్ లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు గురించి అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో బలిజిపేట ఎస్సై వై.సింహాచలం, గరుగుబిల్లి ఎస్ఐ పి.రమేష్ నాయుడు, సిబ్బంది ఉన్నారు.

తెలుగుభాష పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏర్పాటుచేసిన ఛాయాచిత్రప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమం కోసం వారి జీవితాన్నిదారబోసిన గిడుగు వేంకట రామమూర్తి పంతులు జన్మదినం జరుపుకోవడం చాలా సంతోషదాయకమని, ఈ సందర్భంగా తెలుగుబాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. గిడుగు వారు చనిపోయే వరకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మాతృభాషలో నైపుణ్యం గల వారు ఇతర రంగాల్లో కూడా చక్కగా రాణిస్తారని తెలిపారు. పోటీ పరీక్షలను కూడా మాతృభాషలో రాసుకోవచ్చునన్నారు. ప్రతిరోజు ఒక కొత్త తెలుగు పదం, పద్యం నేర్చుకోవాలని, తెలుగు బాషా పుస్తకాలను విద్యార్థులు తప్పని సరిగా చదవాలన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ గిడుగు వేంకట రామమూర్తి పంతులు సవర భాషాభివద్ధికి కృషిచేశారని, తెలుగుభాష ఉన్నంతవరకు వారు జీవించి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు తేజోమూర్తుల శ్రీనివాసులు తెలుగు పద్యగొప్పదనాన్ని తెలిపారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు తెలుగుపాటలను ఆలపించారు. వాసవి జూనియర్ కాలేజీ విద్యార్థిని స్వాతి, టి.ఎం.ఆర్. హైస్కూల్ విద్యార్థిని చికిర్స తెలుగుబాషా గొప్పదనం గూర్చి వివరించారు. కార్యక్రమంలో డిఇఒ జి.పగడాలమ్మ, డిపిఒ బి.సత్యనారాయణ, డిపిఆర్ఒ ఎల్.రమేష్, సంస్కృత పాఠశాల సహాయకులు జెబి తిరుమలాచార్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషపై ప్రతి ఒక్కరూ మక్కువ కలిగి ఉండాలి

బతుకుతెరువు కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా ప్రతి ఒక్కరు మాతృభాష పట్ల మమకారం కలిగి ఉండాలని, దేశ భాషల్లో తెలుగు ఎంతో తీయనైనదని, ఎంతోమంది కవులు మహానుభావులు పేర్కొన్న గొప్ప భాష తెలుగుని, దీన్ని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. గత ప్రభుత్వం హయాంలో తెలుగు భాషకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

మాతృభాషలో బోధన జరిగితే పిల్లలకు పట్టు సాధించే అవకాశం ఉందని, పోటీ పరీక్షల్లో రాణించగలరని ఆయన అన్నారు. ఆంగ్లం నేర్చుకోవడం వరకు ఫర్వాలేదని, అన్ని రాష్ట్రాలు తమ మాతృభాషకు ప్రాధాన్యతను ఇస్తున్నాయని ఎమ్మెల్యే వివరించారు. కూటమి ప్రభుత్వం తెలుగు భాష అభివృద్ధికి తన వంతు కృషి చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తెలుగు భాష గొప్పతనం, ప్రాముఖ్యత గుర్తించి తల్లి లాంటి తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ టి.శ్రీ వరం అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని, మాధుర్యాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పాలన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు. ఆంగ్లభాషపై మోజుతో తెలుగు భాషకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భాష పరిరక్షణలోనే సంస్కతి, సాంప్రదాయాలు నిండుగా ఉంటాయని వాటిని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతర వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక గిడుగు వారిలా, గురజాడ, కందుకూరి, శ్రీశ్రీ, జాషువాలా తయారై నిర్జీవమవుతున్న తెలుగు భాషకు జీవం పోయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉన్నారు.

బాధితులకు పరిహారం చెల్లింపునకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎస్‌సి, ఎస్‌టిలపై దాడుల కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్.సి, ఎస్.టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి కేసును పరిశీలించి వివరాలు అడిగారు. కేసుల విచారణ పక్కాగా నిర్వహించి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు త్వరగా పరిహారం అందించుటకు త్రైమాసిన సమావేశాలకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు వెంటనే అందించాలని తెలిపారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకష్ణ, తోయక జగదీశ్వరి ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో వాస్తవాలు తెలుసుకొని కేసులు పెట్టాలని, తప్పుడు కేసులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, వారికి రావాల్సిన నష్టపరిహారం వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.డి.గయజుద్దీన్ జిల్లాలో కేసులు వివరాలు , బాధితులు అందజేసిన నష్టపరిహారం వ్రివరించారు. సమావేశంలో ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, ఎఎస్‌పి సురానా అంకిత మహావీర్, డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం. దేవుళ్ళ నాయక్, కమిటీ సభ్యులు డి.శాంతిరాజ్, పాల్గొన్నారు.

ప్రశాంతంగా మూడో విడత ఐటిఐ కౌన్సిలింగ్

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ ఐటిఐలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం గురువారం మూడో విడత కౌన్సిలింగ్ నిర్వహించారు. 95మంది దరఖాస్తులు చేసుకోగా, 70 మంది కౌన్సిలింగ్‌కు హాజరు అయ్యారు. వీరిలో 51 మందిని చేర్చుకుంటున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మోటారు మెకానిక్, కోపా వెల్డర్, డ్రస్ మేకింగ్ సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

నియోజక వర్గాల వారీగా జాబ్ మేళాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నైపుణ్యాభివద్ధి సంస్థ రూపొందించిన జాబ్ మేళాల జాబ్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యేలు బోనెల విజయ చంద్ర, నిమ్మక జయకష్ణ, తోయక జగదీశ్వరితో కలిసి విడుదల చేశారు. జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి శిక్షణ అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబరు నుండి వచ్చే ఏడాది మార్చి వరకు జాబ్ మేళాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు పార్వతీపురం, పాలకొండ, సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో నిర్వహించనున్న జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియోజక వర్గాల వారీగా జాబ్ మేళా

పార్వతీపురం నియోజకవర్గంలో సెప్టెంబరు 20, అక్టోబరు 4, నవంబరు 11, డిసెంబర్ 10, వచ్చే ఏడాది జనవరి 21, ఫిబ్రవరి 14, మార్చి 14వ తేదీన జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలను సీతంపేట ప్రభుత్వ ఐటిఐ, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతాయన్నారు.

పాలకొండ నియోజకవర్గంలో సెప్టెంబరు 10, అక్టోబరు 22, నవంబరు 18, డిసెంబర్ 6, వచ్చే ఏడాది జనవరి 3, ఫిబ్రవరి 4, మార్చి 4వ తేదీన జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలను పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదా ఎస్ వి డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదా ఎంఆర్ నగర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతాయన్నారు.

సాలూరు నియోజకవర్గంలో సెప్టెంబరు 27, అక్టోబరు 25, నవంబరు 29, డిసెంబర్ 17, వచ్చే ఏడాది జనవరి 10, ఫిబ్రవరి 18, మార్చి 18వ తేదీన జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలను సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతాయన్నారు.

కురుపాం నియోజకవర్గంలో అక్టోబరు 8, నవంబరు 1, డిసెంబర్ 30, వచ్చే ఏడాది జనవరి 30, ఫిబ్రవరి 27, మార్చి 28వ తేదీన జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలను కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదా గుమ్మలక్ష్మి పురం జి ఎం ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతాయన్నారు.

జాబ్ మేళాలో పాల్గొనుటకు అర్హత ఆసక్తి గల యువత పార్వతీపురం నియోజక వర్గంలో 9177297528 ఫోన్ నంబరుకు, పాలకొండ వివరాలకు 7993795796 ఫోన్ నంబరుకు, సాలూరు నియోజక వర్గం వివరాలకు 8555909899 ఫోన్ నంబరుకు, కురుపాం నియోజక వర్గం వివరాలకు 6303493720 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని ఆయన అన్నారు.



జాబ్ మేళా కేలండర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులు

లేఅవుట్‌లో తాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అమృత్ 2.0 పథకంలో భాగంగా ఇళ్ల లేవుట్‌లో మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను పూర్తిచేయాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అమృత్2.0 పథకంపై నిర్వహించిన సమావేశంలో జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల పనులు, ప్రస్తుత పరిస్థితిపై పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకష్ణ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, ప్రస్తుత పైపులైన్లు లీకులు వస్తున్నాయని, నీరు వృథా అవుతుందని, ఇళ్లనిర్మాణాలకు సంబంధించి లేఅవుట్‌లో మంచినీటి లభ్యత లేకుండా అనువుకాని చోట్ల లేఅవుట్ నిర్మాణాలు చేపట్టారని, దీనివల్ల నిర్మాణపనులు ముందుకు సాగడం లేదని అన్నారు. జిలాప్రజా ఆరోగ్య ఇంజనీరింగు అధికారి కెజిఎన్. నర్శింగరావు మంచినీటి ప్రాజెక్టుల వివరాలను తెలియజేస్తూ అమృత్ 2.0 పథకం కింద పార్వతీపురం మున్సిపాల్టీకి రూ.5.02కోట్లు, సాలూరుకు రూ.3.20 కోట్లు, పాలకొండకు రూ.2.16కోట్ల విలువ చేసే మంచినీటి పథకాలు మంజూరయ్యాయని తెలిపారు. పనులు మధ్యలోనే నిలిచిపోయాయని తెలుపగా, పూర్తిచేసేందుకు కాంట్రాక్టరుతో మాట్లాడి పనులు ప్రారంభిం చేందుకు, పూర్తిచేసేందుకు చర్యలుతీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు.

నేడు కలెక్టర్ పర్యటన

సీతంపేట: జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం సీతంపేట ఐటిడిఎ పరిధిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గర్భిణీల వసతిగృహాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కలిసి ప్రారంభించనున్నారని పిఒ వివి రమణ తెలిపారు. దీంతోపాటు పలు గిరిజన గ్రామాలు, పిఎం జన్ మాన్ సదస్సులు, వీడీవీకేల పరిశీలన, పర్యాటక ప్రాంతాలు, గిరిజన పాఠశాలలను పరిశీలించనున్నారు.

ఉపాధి పనుల్లో బయటపడ్డ అక్రమాలు

ప్రజాశక్తి- వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డ్వామా పీడీ కె. రామచంద్రరావు ఆధ్వర్యంలో సామాజిక ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సభ్యులు మాట్లాడుతూ మండలంలోని 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 825 వివిధ రకాల ఉపాధి పనులకు సంబంధించి వేతన రూపంలో కూలీలకు రూ 16 . 99 కోట్ల పైచిలుక వేతనాలు చెల్లించామని, మెటీరియల్ కింద రూ 19.4 లక్షల పైచిలుక బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ 31 పనులకు సంబంధించి రూ కోటి93 లక్షలు, మెటీరియల్ కింద రూ.45 వేలు చెల్లించినట్లు తెలిపారు. ఇలా మొత్తం 875 పనులకు సంబంధించి వివిధ రూపాల్లో రూ. 21 కోట్ల 28 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. సామాజిక పింఛన్లకు సంబంధివంచి జనవరి నుండి జూన్ వరకు 10,109 మందికి గాను చనిపోయిన వారి బ్యాంకు ఖాతాకు రూ 1,14,000 జమ చేసినట్లు గుర్తించామన్నారు. మండలంలోని 20 మంది ఒంటరి మహిళలకు సంబంధించి రూ.60వేలు చెల్లించారని, కానీ వీరికి గుర్తింపు కార్డులు లేవని చెప్పారు. 24 మందికి భర్తలు ఉన్నప్పటికీ లేనట్టుగా ధ్రువీకరించి రూ 72,000 చెల్లించినట్లు తెలిపారు.

అనంతరం డ్వామా పీడీ కె.రామచంద్రరావు మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్ బి రమేష్ విధుల్లో నిర్లక్ష్యం చూపటం తోపాటు పని జరిగిన చోట నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. ఎపిఒ జి. సత్యం నాయుడుకు షోకాజు నోటీసు జారీ చేయాలని ఎంపీడీవో వై వెంకటరమణ ఆదేశించారు. దశమంతపురం ఇంజనీరింగ్ అసిస్టెంట్ సిహెచ్ నవీన్‌ను సస్పెండ్ చేయాలని పంచాయతీరాజ్ సెక్షన్ ఇంజనీర్‌కు ఆదేశిస్తామని స్పష్టం చేశారు. నడుకూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్కు ఒకే కుటుంబానికి గత 15 సంవత్సరాలుగా రెండు జాబ్ కార్డులు మంజూరు చేసినందున చెల్లించిన వేతనం సంబంధించి రికవర్ చేయాలని అధికారులను పీడీ ఆదేశించారు. కొట్టుగుమ్మడ, నీలానగరం , నడుకూరు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు జాబు కార్డులు అప్డేట్ చేయనందున ఈ నెల 31లోగా డ్వామా కార్యాలయంలో ఆడిట్ చేసుకోవాలని పీడీ రామచంద్రరావు సూచించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి మాస్టర్లో సంతకాలు హాజరు లేక కొలతల్లో తేడా ఉన్నందున ఫీల్డ్ అసిస్టెంట్ నుండి రూ 9.74 లక్షల పైచిలుక నిధులు దుర్వినియోగం అయినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి ఎపిడి జి.శ్రీహరి రావు, ఐకెపి జిల్లా అధికారి ఆర్ రత్నకుమారి, ఎస్ఆర్‌పి బి.దాసు, డిఆర్‌పిలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్ • ఎపిఒకు షోకాజు నోటీసు



సామాజిక ప్రజావేదికలో సమీక్షిస్తున్న డ్వామా పీడీ కె.రామచంద్రరావు

మరమ్మతులకు గురైన లారీ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గంగరేగువలస నుంచి కూనేరు వరకు గల అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారడంతో ఒడిశాలోని రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ బుధవారం అర్ధరాత్రి కొమరాడ శివాలయం సమీపంలో గోతుల వద్ద మరమ్మతులకు గురైంది. దీంతో లారీ రోడ్డుకు అడ్డుగా ఉండిపోవడంతో గురువారం మధ్యాహ్నం వరకు పెద్దఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో అటు కునేరు వైపు ఇటు పార్వతీపురం వైపు సుమారు పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఇరువైపు నుంచి వచ్చిన లారీలు రోడ్డుపై ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ఉద్యోగులు, కళాశాలలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు, ఆటోలు రాకపోకలకు ఆటంకం ఏర్పడడంతో ప్రయాణికులు నడుచుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తక్షణమే లారీ డ్రైవర్లు స్థానికుల సహాయంతో మరమ్మతులకు గురైన లారీని బాగు చేసి స్థానిక పోలీసులు సహాయంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. తక్షణమే అధికారులు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగానైనా రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను కప్పి ట్రాఫిక్ అంతరాయంతో పాటు ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నిరసన


ప్రభుత్వం తక్షణమే స్పందించి గోతులు ఏర్పడ్డ అంతర రాష్ట్ర రహదారిపై ఉన్న గోతుల్లో మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడకు చెందిన బత్తిలి శ్రీనివాసరావు, ఎం.సూరపునాయుడు, చిల్ల సింహాచలం, మరడాన మురళి. వి.ధనుంజయనాయుడు, కొల్లి సాంబమూర్తి, ఎ.ఉపేంద్ర, పోలీస్ సిబ్బంది గోతులను కప్పారు. అనంతరం ట్రాఫిక్ జాం వద్ద వాహనదారులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో గురువారం రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ రోడ్లు మరమ్మతులు చేయకపోవడంతో ఎప్పటిప్పుడు ఇలా ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర అవస్థలుపడుతున్నారన్నారు. గత పాలకులు ఐదేళ్లలో గోతులు కప్పు తామంటూ కాలయాపన చేశారు తప్ప ఎక్కడా ఒక గొయ్యిని కప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా గోతులు కప్పుతామంటూ రెండు నెలల నుంచి చెబుతున్నా నేటికీ మరమ్మతులకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఎప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు.

10 కిలో మీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్



ట్రాఫిక్ స్తంభించిపోవడంతో నడిచి వెళ్తున్న ప్రయాణికులు

ఇసుక ర్యాంపును పరిశీలించిన ఆంధ్రా, ఒడిశా అధికారులు



ర్యాంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

భామిని : మండలంలోని దిమ్మదిజోల సమీపాన గల వంశధార నదీ తీరంలో ఒడిస్సా అనుమతులతో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు వివాదంతో గత కొన్ని రోజులుగా ర్యాంపు నిలిచిపోయింది. సరిహద్దు వివాదం నిమిత్తం పర్లాకిముడి సబ్ కలెక్టర్ అనూప్ పండా, కాశీనగర్ తహశీల్దార్ అశోక్ ప్రధాన్, ఒడిస్సా మైనింగ్ అధికారి దీపిన్ పరిడర్, ఆంధ్రా నుంచి పాలకొండ ఆర్‌డిఒ వివి రమణ, డివిజనల్ సర్వేయర్ వెంకటరావు, భామిని తహశీల్దార్ ఉమామహేశ్వరరావు గురువారం పరిశీలించారు. 1994 ఒడిశా చేసిన సర్వే ప్రకారం ర్యాంపు నిర్వహిస్తున్న స్థలం ఒడిస్సా భూ భాగం పరిధిలో ఉందని అధికారులు తెలిపారు. సరిహద్దు మ్యాప్‌ను ఆంధ్రా అధికారులకు చూపారు. ఆంధ్రా మ్యాప్ ప్రకారం ఈ ర్యాంపు ఆంధ్రా భాగంగా సూచిస్తుందని అన్నారు. పూర్తి స్థాయి సర్వేతో కూడిన ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు డాకుమెంట్లను పరిశీలిస్తేనే ప్రస్తుత సమస్య పరిష్కారమవుతుందని ఆంధ్రా అధికారులు తెలిపారు. కొన్ని డాకుమెంట్లను పరిశీలించిన అనంతరం రెండు, మూడు రోజుల్లో సరి హద్దు వివాదం పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

31న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

పార్వతీపురంరూరల్ : 'పేదల సేవలో' కార్యక్రమం కింద పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఈ నెల 31న పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయించిందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1న ఆదివారం సెలవుదినం కావడంతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఆగస్టు 31న గ్రామాల్లో అందుబాటులో ఉండి పింఛన్లు పొందాలని ఆయన కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సెప్టెంబర్ 2న పింఛన్లు పొందవచ్చని ఆయన చెప్పారు. ఈనెల 31న శత శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలనే లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. జిల్లాలో 1.42 లక్షల మందికి రూ.59.37 కోట్లను పంపిణీ చేస్తున్నామని ఆయన చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు పింఛన్ల పంపిణీకి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పురస్కారాన్ని అందుకుంటున్న మంచిపల్లి శ్రీరాములు

మంచిపల్లికి గిడుగు సేవా పురస్కారం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, సాహితీ లహరి వ్యవస్థాపకులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు గిడుగు సేవా పురస్కారాన్ని గురువారం విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమములో అందుకున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా విజయవాడకు చెందిన నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు గిడుగు జాతీయ జీవన సాఫల్య పురస్కారానికి తనను ఎంపిక చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మంచిపల్లి శ్రీరాములకు పురస్కారం అందుకోవడం పట్ల స్నేహ కళా సాహితీ అధ్యక్షులు, ప్రముఖ కథా రచయిత గంటేడ గౌరునాయుడు, కవులు, రచయితలు మల్లిపురం జగదీష్, పక్కి రవీంద్ర, స్వామినాయుడు, గోపాలరావు, రోహిణీ, అరసం జిల్లా అధ్యక్షులు అప్పలనాయుడు, కార్యదర్శి పి.రామలింగ స్వామి తదితరులు అభినందించారు.

క్రీడా ప్రతిభ అవార్డుకు కొత్తగూడ పాఠశాల ఎంపిక

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

2023-24 విద్యా సంవత్సరంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో పాల్గొని మంచి ప్రతిభను కనబరిచి సత్తా కనబరిచారు. మన్యం జిల్లాలో ఐదు పాఠశాలలు పాల్గొనగా అందులో కొత్తగూడ పాఠశాల క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు పిడి మాధవరావు తెలిపారు.

పరీక్షల నిర్వహణ సంతృప్తికరం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న రెండవ యూనిట్ పరీక్షలను జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి మంజుల వీణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకే పేపర్తో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో ఈ పరీక్షలను ఈనెల 29 , 30 ,31 తేదీల్లో కొనసాగుతాయన్నారు. కాలేజీల్లో జరుగుతున్న పరీక్షల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు గణపతి, మహారాణి, రాధాకృష్ణ, కల్పన, తేజేశ్వర్ రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న ఎఎస్‌పి

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సబ్ డివిజన్ ఎఎస్‌పి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్‌ను సబ్ డివిజన్ ఎఎస్‌పి అంకిత సూరనా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను, పాత కేసులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల గూర్చి ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం స్టేషన్ పరిధిలో గతంలో 23 కేసులలో పట్టుకున్న 736 అక్రమ మద్యంబాటిళ్లను ఆమె మధ్యవర్తుల సమక్షంలో తగలబెట్టించారు. పార్వతీపురం సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల కాపాడడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం రాజేష్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విఎంసి రాష్ట్ర సహాయ ఉపాధ్యక్షులుగా సవరపు

ప్రజాశక్తి - సీతానగరం

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ రాష్ట్ర సహాయ ఉపాధ్యక్షుడుగా సవరపు రామారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నూతన కమిటీ 17 మంది సభ్యులతో ఏర్పాటైందని, ఇందులో సహాయ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం ఎంతో సంతోషమని ఈ కమిటీ ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరించే దిశగా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు ఈ బాధితులు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పిహెచ్‌సిల్లో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి, కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి - చర్యలు గిరిజన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీజన్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కేసుల గురించి ఆరా తీశారు. మందుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరాలుంటే ముందస్తుగా తెలుసుకొని వైద్యసేవలు అందించాలన్నారు. జ్వరాల ఉంటే అదుపునకు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వైద్యులు భాను ప్రతాప్, చాందిని సిబ్బందికి పలు సూచనలు చేసి అప్రమత్తం చేసి యున్నారు

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఆక్రమణంలను తొలగించాలని ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ అన్నారు. మండలంలోని గ్రామ పెద్దలు, గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించాలని గ్రామస్తులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్లు పైన పశువులను కట్టరాదని, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణ స్వచ్ఛందంగా తొలగించాలని వారు తెలిపారు. అలాగే ప్రతి పంచాయతీలోనూ గ్రామ పెద్దలు ముందుకు వచ్చి ఆక్రమణలకు తొలగింపులకు సహకరించాలని, పారిశుధ్య నిర్వహణకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

వెంగాపురం ఎంపిటిసి, సర్పంచ్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వెంగాపురానికి చెందిన సర్పంచ్ గులుపల్లి అమ్మడమ్మ, ఎంపిటిసి గులిపిల్లి మురళి గురువారం పార్వతిపురంలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఇంటి వద్ద టిడిపిలో చేరారు. వీరితో పాటు పదిమంది వార్డు మెంబర్లుతో సహా 90 శాతం పైగా గ్రామంలో కుటుంబాలన్నీ టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ మురళికి సహకరిస్తానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వెంగాపురం గ్రామ పెద్దలు, టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బిఐ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని, డిగ్రీ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సంబంధిత పోస్టర్‌ను తన ఛాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు https://www.rbi90quiz.in వెబ్‌సైట్‌లో కనీసం ఇద్దరు విద్యార్థులు టీమ్‌గా రిజిస్టర్ కావాలన్నారు. స్టేట్, జోనల్, నేషనల్ లెవెల్లో జరిగే ఈ పోటీల్లో రూ.2 లక్షల నుండి రూ.10లక్షల వరకు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాలకొండ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు 3, 2 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఐటిడిఎ ఎపిఒ చినబాబు జెండా ఊపి ప్రారంభించారు. బాలురకు నిర్వహించిన 3కిలోమీటర్ల పోటీల్లో వీరఘట్టం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎం.పవన్ తేజ, ఎస్. నందకృష్ణ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. మల్లి గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.కొయోమో తృతీయ స్థానం సాధించారు. బాలికలకు నిర్వహించిన 2కిలోమీటర్ల పోటీల్లో వీరఘట్టం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పి.సంజన ప్రథమ, తెట్టంగి పాఠశాలకు చెందిన ఎన్. నీలాద్రి ద్వితీయ, సీతంపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎస్.సమిత తృతీయ స్థానాలు సాధించారు. ఈ పోటీలకు పాలకొండ నియోజకవర్గంలోని 28 పాఠశాలల నుంచి 72 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఐటిడిఎ ఎపిఒ బహుమతులు అందజేశారు. అనంతరం ఐటిడిఎ మీటింగ్ హాల్లో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ నారాయుడు, అకౌంట్స్ ఆఫీసర్ విజయరాణి, ఎఎంఒ కోటిబాబు, స్పోర్ట్స్ ఇంఛార్జి జాకబ్ దయానందం, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో...

జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం గురించి పిల్లలు అభినయం చేశారు. క్రీడల గొప్పతనం తెలియపరుస్తూ విద్యార్థులచే మంచి పిరమిడ్లను ప్రదర్శించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ఐటిడిఎ డివిజనల్ స్థాయి మూడు కిలోమీటర్ల పరుగు పోటీలో ఈ పాఠశాల విద్యార్థిని సవర సమిత మూడో స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యుఒ అమల, పాఠశాల సిబ్బంది, తెలుగు ఉపాధ్యాయులు శైలజ, ప్రశాంతి ని మరియు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రమీల శైలజలను అభినందించారు.

వీరఘట్టం : మండలంలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిదిమి మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాంప్రదాయ వస్త్రాలు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన సర్పంచి ధమలపాటి ఉమామహేశ్వరరావు రూ.6 వేలు విలువ గల భోజనం ప్లేట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. బొడ్లపాడులో జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ తెలుగు భాష దినోత్స కార్యక్రమం నిర్వహించారు. కంబర వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ఉపాధ్యాయులు చంద్రమోహన్, శ్రీనివాసుకు ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : తెలుగు భాషా, జాతీయ క్రీడ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు సిబ్బంది తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాంచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థులతో పలు నృత్యగానాలు ప్రదర్శించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కుంబరిక కృష్ణ మట్టితో బొమ్మలు చేస్తూ అందర్నీ అబ్బుర పరుస్తూ పర్యావరణ కాలుష్య నియంత్రణ కోసం మట్టి వినాయకుడు విగ్రహాలు తయారు చేసి తనలో క్లే ఆర్ట్ ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. ఈ విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామగోవింద, ఉపాధ్యాయులు, అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.ముత్యాలు ఆధ్వర్యంలో తెలుగు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మక్కువ :మండలంలోని ముఖ్యాయవలస మోడల్ పాఠశాలలో మాతృభాషా, క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జ్ ప్రిన్సిపల్ రత్నకుమారి ఆధ్వర్యంలో పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల ఉండగా జడ్పీటీసీ ఎంపీపీ ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన చైర్పర్సన్ ఎస్.భారతి కి కనీస ఆహ్వాన సమాచారం లేకపోవడం కొసమెరుపు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, జి.బాబూరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పిఠాపురాలు గిడుగు. వెంకట రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు భాషా గొప్పతనాన్ని తెలిపే సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాష అంటే అమ్మ భాష తెలుగులో నేర్చుకున్న అంశం అది మనలో నిలిచిపోతుందని ప్రిన్సిపల్ రఘు పాత్రుని శివకుమార్ అన్నారు. అనంతరం తెలుగు భాష ఉపాధ్యాయులును, క్రీడా ఉపాధ్యాయులును శాలువా తో సత్కరించి, సన్మానం చేసారు. కార్యక్రమం లో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సీతంపేట గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల పిరమిడ్లు ప్రదర్శన



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తెలుగు కవుల ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్

మాదక ద్రవ్యాలను నివారించాలి : కలెక్టర్

పార్వతీపురంరూరల్ : జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణ జరగాలని జిల్లా కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి విధిగా శిక్షలు పడేలాకట్టుదిట్టమైన ఆధారాలు సమకూర్చాలని ఆయన అన్నారు. అటవీ ప్రాంతం గుండా జరిగే రవాణాకు అటవీ శాఖ అడ్డుకట్ట వేయాలని సూచించారు.ాగంజాయి, ఇతర మత్తు పదార్థాల చెడు ప్రభావాలను వివరించాలని ఆదేశించారు. విద్యా సంస్థలు వద్ద కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నాటు సారా విక్రయంపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల పంటలు పండించే వారికి ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తామనిచెప్పారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా పైనా దష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌పి ఎస్ వి మాధవ రెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను రూపు మాపడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా మీదుగా రవాణాతో పాటు వివిధ ప్రాంతాల్లో నిల్వలు పెట్టడం లేదా వినియోగించడం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు ప్రత్యేకంగా ఫోన్ నంబరును ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో ఎఎస్‌పిలు డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్, సురాన అంకిత్ మహావీర్, డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, వివి రమణ, పాలకొండ డిఎస్పీ జివి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.వినోద్, డిఇఒ జి.పగడాలమ్మ, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కోల్‌కత్తాలో యువ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం అనంతరం హత్య చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అంగన్వాడీ హెల్పర్ యూనియన్ కొమరాడ ప్రాజెక్టు లీడర్ సిరికి అనురాధ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి యువ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, సిరికి అనురాధ మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యాచారానికి దేశవ్యాప్తంగా నిరసన పెల్లుబికుతున్నా చర్యలు శూన్యమన్నారు. ఎంతో మంది ప్రాణాలు కాపాడే వైద్యులకే ఈరోజు ఇలా జరిగితే సామాన్యులకు రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. కావున వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజకీయం నాయకులు ఎంతటి వారున్నా మెడికల్ మాఫియా కూడా ఎవరున్నా వారిని వదిలేయకుండా వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, పార్వతి, వరలక్ష్మి, మంగ, సుజాత, లలిత, అనురాధ పాల్గొన్నారు.

పవన్ పుట్టినరోజున పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి -మక్కువ

జనసేన రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మక్కువ మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్, మండల ఉపాధ్యక్షులు వెంపడాపు సుగుణేశ్వరరావు తెలిపారు. సెప్టెంబర్ 2న మక్కువ సెంటర్లో ఉచిత వైద్య శిబిరం, చినబోగిలి జంక్షన్ నుండి ఇండియన్ పెట్రోల్ బంక్ వరకు బైక్ ర్యాలీ, కేక్ కటింగ్, ఉచిత భోజనం పంపిణీ చేపడుతున్నామన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

ప్రజాశక్తి - సాలూరు

ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు విధిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు చెప్పారు. పట్టణ పోలీసులతో కలిసి హెల్మెట్ ధారణపై మామిడిపల్లి జంక్షన్, గాంధీనగర్ జంక్షన్, బైపాస్ జంక్షన్‌లో గురువారం అవగాహన కల్పించారు. అనంతరం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జెవిఎస్ఎస్-ఎస్ ప్రసాద్‌తో కలిసి ఎక్కడికక్కడ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలనే దానిపై చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా చేపడుతున్న చర్యలకు అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ సీతారాములు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వాహనదారులకు హెల్మెట్ ఉపయోగంపై అవగాహన ఎస్ఐ పి రమేష్ నాయుడు అవగాహన కల్పించారు. మండలంలోని గొట్టివలస వద్ద వాహనచోదకులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధానమైన కారణాలు నిర్లక్ష్యంగా, అతివేగం, అజాగ్రత్త కావున ద్విచక్ర వాహన చోదకులు నిర్లక్ష్యంగా కాకుండా, పరిమితిమైన వేగంతో అజాగ్రత్త వహించకుండా వాహనాలు నడిపి ద్విచక్ర వాహనదారులు గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాము, హోంగార్డు రవి, పాల్గొన్నారు.

సీతానగరం: హెల్మెట్ పెట్టుకోండి ప్రాణాలు కాపాడుకుందాం ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని చినబోగిలి జంక్షన్లో వానదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఉద్యోగ జీవితం సంతృప్తికరం

ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి బి.సత్యవతి

ప్రజాశక్తి - సాలూరు

మహిళా శిశు సంక్షేమశాఖలో 31 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానం ఎంతో సంతృప్తినిచ్చిందని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి బి.సత్యవతి చెప్పారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న ఆమె తన ప్రస్తానం గురించి ప్రజాశక్తి తో ప్రస్తావిస్తూ...

నర్సిపురంలోని యుపి పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుకున్నాను. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు పార్వతీపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకున్నా. బిఎ డిగ్రీ కరెస్పాండెన్స్ ద్వారా పూర్తి చేశాను. 1993లో ఎపిపి ఎస్సీ ద్వారా గ్రేడ్ -1 సూపర్ వైజర్‌గా ఐసిడిఎస్ శాఖలో నియామకం జరిగింది. అరుకు వ్యాలీలో మొదటి సారి సూపర్ వైజర్‌గా పని చేశాను. అక్కడ ఆరు నెలలు చేసిన తర్వాత సాలూరు రూరల్ ప్రాజెక్టుకు బదిలీపై వచ్చాను. సాలూరు ప్రాజెక్టులో ఐదేళ్ల పాటు పని చేశాను. ఆ తర్వాత పార్వతీపురం ప్రాజెక్టులో మూడేళ్లు, కురుపాంలో రెండేళ్ల పాటు పని చేశాను. 2013లో అదనపు సిడిపిఒగా పదోన్నతిపై బొబ్బిలి ప్రాజెక్టుకు బదిలీ అయ్యాను. 2019లో పార్వతీపురం ప్రాజెక్టుకు



అదనపు సిడిపిఒగా బదిలీ అయ్యాను. 2022లో సాలూరు ప్రాజెక్టు సిడిపిఒగా పదోన్నతిపై బాధ్యతలు చేపట్టాను. 31 ఏళ్ళ ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా సాగింది. విధినిర్వహణలో తన సహచర ఉద్యోగులు, అధికారులు బాగా సహకరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేయడం ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాను. సూపర్ వైజర్‌గా పని చేస్తున్న సమయంలో కొంతమంది మైనర్ బాలికల వివాహాలను నిలిపివేసి వారు చదువుకునేలా అవగాహన కల్పించడం నాకు సంతృప్తి నిచ్చింది.సమయపాలన, ప్రణాళికాబద్ధంగా పని చేయడం ఈ శాఖ లో పని చేస్తున్న ఉద్యోగులు అలవర్చుకోవాలి.

కుటుంబ నేపథ్యం

పార్వతీపురం మండలం నర్సిపురం సొంత గ్రామం. తండ్రి బర్ల రామునాయుడు రిటైర్డ్ టీచర్, తల్లి గహిణి. ఇద్దరు అన్నదమ్ములు, ఇద్దరు అక్కాచెల్లెళ్ళం. 1962 ఆగష్టు 15న జన్మించాను. భర్త కృష్ణమూర్తి నాయుడు ఎంఎ తెలుగు చేశారు. పార్వతీపురం ప్రయివేటు డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేశారు. మాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పూర్ణచంద్ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. కోడలు వెంకటవందన మెకానికల్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. కుమార్తె శిరీష ఎంఎస్సీ బిఇడి చేశారు. గృహిణిగా ఉన్నారు. అల్లుడు బొబ్బిలిలో బ్యాంక్ ఉద్యోగి గా పని చేస్తున్నారు.

భారీ వాహనాలతో రోడ్లు ఛిద్రం

ప్రయాణికులు, విద్యార్థులకు అవస్థలు

తక్షణమే రహదారులను బాగు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రహదారి పనుల్లో భాగంగా భారీ వాహనాల రాకపోకల వల్ల మండలంలోని కొటికిపెంట, కేసలి, మడవలసకు వెళ్లే రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. దీంతో పిల్లలు చదువుకోవడానికి స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లాలన్నా, వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాలన్నా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ పూర్తిగా పాడైపోయినా అధికారులు పట్టించుకోలేదని ఆ గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సిపిఎం ఆనయకులు, గ్రామస్తులు గురువారం పాడైపోయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కోడి కాలువలస నుండి కొట్టుకుపెంట, కేసలి మీదుగా మడవలస వెళ్లే రోడ్లన్నీ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వాహనాల రాకపోకల వల్ల బాగా పాడైపోయాయన్నారు. రోడ్లన్నీ వెంటనే బాగు చేయాలని, దీనిపై అధికారులు పరిశీలన చేసి రోడ్డు మరమ్మతుల కోసం హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ రోడ్లపై పెద్ద పెద్ద గుమ్ములు ఏర్పడడంతో కనీసం నడవడానికి కూడా అవకాశం లేకుపోయిందన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జిల్లాలో నేడు వన మహోత్సవం

పార్వతీపురంరూరల్ : జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది "ఏక్ పెడ్ మా కె నామ్" శీర్షికన వన మహోత్సవంను నిర్వహిస్తున్నామని తెలిపారు. సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వ్ అటవీ ప్రాంతంలో అర హెక్టారు భూభాగంలో 30వ తేదీన వన మహోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. హరిత ఆంధ్ర ప్రదేశ్ ఉద్యమంలో భాగంగా 2029 సంవత్సరం నాటికి 50 శాతం భూభాగం మొక్కలతో నిండి ఉండాలనే సంకల్పంతో కృషి చేస్తున్నామని వివరించారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత రెండేళ్లుగా వేతనాలు అందుకోని పారిశుధ్య కార్మికులకు తక్షణమే ప్రభుత్వం వేతనాలు చెల్లించి ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ కోరారు. నెల జీతం రూ.6వేలు ప్రభుత్వం ప్రకటించినా వేతనం అధికారులు చెల్లించ లేదన్నారు. 2015 నుంచి గ్రామాల్లో గల తడి, పొడి చెత్తను సేకరిస్తూ గ్రామాన్ని శుభ్రం చేస్తూ గ్రామ పారిశుధ్య కార్మికులు అనారోగ్యాలు బారిన పడుతున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు వీరికి జీతాలు ఇవ్వడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులకు క్రిములు, కీటకాలు నుంచి రక్షించుకోవడానికి చేతి గ్లౌజులు, కాళ్లకు బూట్లు, శానిటైజర్, సబ్బులు షాంపులు పరికరాలు ఇవ్వాలని కోరారు. కొత్త రిక్షాలు పంపిణీ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని అన్నారు.

బిందు, తుంపర సేద్యంతో 750 మందికి నిధులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 750 మంది తుంపర సేద్యం లబ్ధిదారులకు రూ.53.79 లక్షలు నిధులు విడుదల చేస్తూ పరిపాలన ఆమోదం వచ్చినట్టు కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్కువ నీటి వనరులతో వ్యవసాయం చేసేందుకు తుంపర సేద్యం పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సబ్ ప్లాన్ మండలాల్లో రైతులకు తుంపర సేద్యానికి రాయితీ అందజేశామని తెలిపారు. ప్రస్తుతం ఐటిడిఎ పరిధిలో 750 మందికి రూ .53.79 లక్షలు నిధులు విడుదల చేశామని, ప్రతి రైతుకు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ తరుపున చిన్న, సన్నకార రైతులకు (5ఎకరాల్లోపు) 55శాతం రాయితీ, పెద్ద రైతులకు (5 ఎకరాలు నుంచి 12.5 ఎకరాలు వరకు) 45శాతం రాయితీ ఇప్పటికే అందజేశామని తెలిపారు. దీనికి అదనంగా ప్రతి గిరిజన రైతుకు రూ.7172 ఐటిడిఎ తరపున రాయితీ ఇస్తామన్నారు. రాయితీ పొందేందుకు ప్రతి రైతుకు ఒక ఎకరా తక్కువ కాకుండా భూమి, బోరు బావి, ఆయిల్ ఇంజిన్, సోలార్ పంప్ ఉన్న గిరిజన రైతులు ఈ పథకానికి అర్హులని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పథకం పొందదల్చిన గిరిజన రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని, లేకుంటే 7995009841 (కేశవ్, స్పింకర్స్ ఇంజనీరు) నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకొనేందుకు అవసరమైన ఆధార్ కార్డు, 1 బి, రైతు బ్యాంకు అకౌంట్, రైతు యొక్క గుర్తింపు కార్డు (ఆధార్ కాకుండా), రైతు ఫోన్ నెంబర్ అందజేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



మృతి చెందిన సింహాచలం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం గవరమ్మపేటకు చెందిన భోగిల సింహాచలం అనే దినసరి కూలీపై నుంచి కాంక్రీట్ మిల్లర్ ఎక్కి వెళ్లడంతో మృతి చెందాడు. స్నేహితులు తెలిపిన వివరాలు ప్రకారం సింహాచలం ప్రయాణిస్తున్న పికప్ వ్యాన్ నుంచి గుమ్మగదబవలస సమీపాన జారిపడడంతో వెనుక కట్టి ఉన్న కాంక్రీట్ మిల్లర్ ఒక్కసారి ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం భద్రగిరి సిహెచ్‌సి తీసుకెళ్లగా అప్పటికే పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పొట్ట కూటి కోసం సింహాచలం గవరమ్మపేట నుంచి గుమ్మలక్ష్మీపురం రోజు కూలి పనులకు వస్తుంటాడని తెలిపారు. తోటి మిత్రుడు కంటి ముందు చనిపోవడంతో స్నేహితుల రోదించారు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొని హోంగార్డుకు గాయాలు

ప్రజాశక్తి - భామిని

భామిని నుండి కొత్తూరు వెళ్తున్న కారు గజపతినగరం గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై గొయ్యి ఉండడంతో కారును డ్రైవర్ నెమ్మదిగా వెళ్తున్నారు. కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న హోం గార్డ్ కొండగొర్రి లక్ష్మణరావు కారును ఢీకొట్టాడు. దీంతో హోమ గార్డ్ తలకు గాయాలయ్యాయి. ఆయన్ను భామిని పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించారు.